మరమ్మతుల్లేక.. సాగునీరందక..

- అభివృద్ధికి నోచుకోని స్లూయిజ్‌లు
- ముంపునకు గురవుతున్న పంట పొలాలు
- పట్టించుకోని అధికారులు



ర్యాలి వద్ద శిథిలావస్థకు చేరిన స్లూయిజ్

ఆత్రేయపురం: సెంట్రల్ డెల్టా ఇరిగేషన్ పరిధిలోని సాగునీటి పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. లొల్ల లాకుల ద్వారా డెల్టా ప్రాంతానికి సాగునీరు సక్రమంగా అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. సెంట్రల్ డెల్టా ఆధునీకరణ పనుల్లో భాగంగా పూడిక పనులు మినహా మిగతా అన్ని పనులు తూతూమంత్రంగా చేపట్టి అధికారులు చేతులు దులిపేసుకుంటున్నారు.

అభివృద్ధి పనులు చేపట్టకపోతే..

బ్రిటీష్ హయంలో నియమించిన స్లూయిజ్‌లు, డీపీలు, గేట్లు, లాకుల వ్యవస్థ శిథిలస్థితికి చేరింది. దీంతో ఏటా రైతుకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో డెల్టా పరిధిలో ఇంజినీరింగ్ సిబ్బంది సూచిస్తున్న అభివృద్ధి పనులు చేపట్టక పోవడంతో రాబోయే కాలంలో పంటలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గ పరిధిలో ఉన్న స్లూయిజ్‌లు

నియోజకవర్గ పరిధిలోని ఆత్రేయపురం మండలంలోని లొల్ల ఇరిగేషన్ సెక్షన్‌లో ఐదు చానల్స్‌పై 92 స్లూయిజ్‌లు, డీపీలు, రావులపాలెం మండలంలోని గోపాలపురం సెక్షన్‌లో రెండు చానల్స్‌పై 42 స్లూయిజ్‌లు, డీపీలు, ఆలమూరు మండలంలోని చొప్పెల్ల సెక్షన్‌లో నాలుగు చానల్స్‌పై 60 స్లూయిజ్‌లు, డీపీలు, ఆలమూరు ఇరిగేషన్ పరిధిలోని రెండు చానల్స్‌పై 20 స్లూయిజ్‌లు, డీపీల ద్వారా సుమారు 60 వేల ఎకరాల శివారు భూములకు సాగునీరు అందుతుంది.

సిబ్బంది స్లూయిజ్‌లను ఆధునికరిస్తే రైతులు ఎవరి అవసరం లేకుండా పంట చేలకు నీరు అవసరమైన సమయాల్లో సరఫరా చేసుకోనే అవకాశం ఉంటుంది. దీనివల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఇప్పటికైనా అధికారులు స్లూయిజ్‌ల ఆధునీకీకరణకు దృష్టి సారించాలని, ప్రభుత్వం చర్యలు చేపట్టి సాగునీటి ఇక్కట్లు పరిష్కరించాలని డెల్టా ప్రాంత రైతులు కోరుతున్నారు.

డెల్టా ఆధునీకరణకు చర్యలు



సెంట్రల్ డెల్టా పరిధిలోని సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతాం. ఆధునీకరణకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించాం. అనుమతులు వచ్చిన వెంటనే చర్యలు చేపడతాం.

– పిల్లా సత్యనారాయణ, లొల్లలాకుల ఇరిగేషన్ ఏఈ

మరమ్మతులు చేయాలి



బ్రిటీష్ హయంలో నిర్మించిన లాకుల వ్యవస్థ చిన్నాభిన్నమైంది. రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు హామీలు నీటి మూటలుగా ఉన్నాయి. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు సాగునీటి కోసం కష్టాలు పడుతున్నారు.

– గారపాటి గంగారామ్ చౌదరి, అంకంపాలెం

క్లుప్తంగా

ముంపు బాధితులకు సాయం



బియ్యం అందజేస్తున్న సర్పంచ్ ప్రకాశరావు

మామిడికుదురు: ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పాశర్లపూడిలంకలో ముంపు బారినపడిన 186 మంది బాధితులకు 25 కిలోలు బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు. సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు చేతుల మీదుగా వాటిని అందజేశారు. పంచాయతీ కార్యదర్శి డి.సురేష్, వీఆర్వో వీఎస్ఆర్ఎస్ రాయుడు, తెలగారెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు

మామిడికుదురు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణానికి మండలానికి రూ.3 కోట్లు నిధులు మంజూరయ్యాయని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఈ నెల 23వ తేదీన ప్రతి గ్రామంలో గ్రామ సభ నిర్వహించాలన్నారు. ఈ సభలో ఉపాధి హామీలో చేపట్టే పనులపై చర్చించి ఆమోదం తెలపాలన్నారు. వీటితో పాటు గోకులం షెడ్ల నిర్మాణానికి కూడా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు.

కవి వెంకట్‌కు సన్మానం

అంబాజీపేట: గ్రామానికి చెందిన సహజకవి, జాతీయ పురస్కార గ్రహీత వెంకట్ పాలమూరిని అమలాపురం అంబేడ్కర్ కళా భవన్‌లో శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన తెలుగు బాషా దినోత్సవ సంబరాల్లో ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చేతుల మీదుగా వెంకట్ సన్మానం అందుకున్నారు. కవులు, కళాకారులతోపాటు మాకే బాలార్జున, సత్యనారాయణ, బీవీవీ సత్యనారాయణ, తరపట్ల సత్యనారాయణ, ఈశ్వరిభూషణం, సుజాత పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ముఖ్యం

మలికిపురం: ప్రతి ఒక్కరికీ ఎయిడ్స్‌పై అవగాహన ముఖ్యమని చైల్డ్ ఫౌండేషన్ ఇండియా సంస్థ జిల్లా రీసోర్స్ పర్సన్ ఇ.రాజశేఖర్ పేర్కొన్నారు. సోమవారం మలికిపురం డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జోనల్ సూపర్ వైజరు శ్రీనివాసరావు, జి. అనూష, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్ రోహిల్ బాబు, డి.శ్రీనివాస్, ఎన్. రమేష్, కె.వి.హెచ్ విజయ కుమార్, బి.నిశ్చలాదేవి అధ్యాపకులు పాల్గొన్నారు.

డీ వార్మింగ్ డే వాయిదా

ఆలమూరు: జిల్లా వ్యాప్తంగా ఈనెల 20న జరగాల్సిన డీ వార్మింగ్ డే వాయిదా పడినట్టు కొత్తపేట డివిజన్ వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. ఈ సందర్భంగా చొప్పెల్లలో సోమవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వాయిదా నిర్ణయం తీసుకుందన్నారు. వచ్చే నెల 17న మలి విడత డీ వార్మింగ్ డేను నిర్వహించనున్నారని ఆమె పేర్కొన్నారు. వైద్యాధికారులు డి.సువర్చలనాయుడు, ఆర్.మల్లికార్జున్ పాల్గొన్నారు.

గొంది పంచాయతీ గ్రేడ్-2 కార్యదర్శిగా అడబాల

సఖినేటిపల్లి: గొంది గ్రామ పంచాయతీ గ్రేడ్-2 కార్యదర్శిగా అడబాల గంగరాజు సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేట్టారు. గతంలో గుడిమూల పంచాయతీకి ఇన్‌చార్జి కార్యదర్శిగా ఉన్నారు. అనంతరం బదిలీపై ఉయ్యూరువారి మెరక పంచాయతీ జూనియర్ అసిస్టెంట్‌గా పని చేశారు. పదోన్నతిపై గొంది పంచాయతీకి గ్రేడ్-2 కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్నారు. వీవీ మెరక కార్యదర్శి ఎస్ఆర్‌కే రాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రెండుకు చేరిన మృతుల సంఖ్య



ఆకుల వెంకన్న (పాతచిత్రం)

ఆలమూరు: జాతీయ రహదారిలోని చొప్పెల్ల వద్ద ఈనెల 17వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఆ ముగ్గురిలో ఇప్పటికే కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం అడబాల సత్యనారాయణ(52) మృతి చెందగా, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఆకుల వెంకన్న(35) మృతి చెందాడు. ఇందులో తీవ్రంగా గాయపడ్డ చిక్కిరెడ్డి రాజు పరిస్థితి కాస్త నిలకగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు. ఈమేరకు ఎస్సై ఎం.అశోక్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ బస్ బోల్తా

మలికిపురం: కేశనపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం స్కూల్ బస్ బోల్తా పడింది. ఆ సమయంలో బస్‌లో సుమారు 10 మంది విద్యార్థులు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. వారెవరికి ఎటువంటి గాయాలు కాలేదని చెప్పారు.

తాటిచెట్లు అక్రమంగా తొలగిస్తే చర్యలు



తహసీల్దారు నాగ లక్ష్మమ్మకు అర్జీ ఇస్తున్న ఎంపీపీ మల్లిబాబు

సఖినేటిపల్లి: భూలోక కల్పవృక్షంగా ప్రసిద్ధి చెందిన తాటిచెట్లను ఎటువంటి అనుమతులు లేకుండా తొలగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వీరా మల్లిబాబు తహసీల్దారు సీహెచ్ నాగ లక్ష్మమ్మకు సోమవారం అర్జీ అందజేశారు. ఈ మేరకు తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎంపీపీపై అర్జీని తహసీల్దారుకు ఇచ్చారు. తాటిచెట్లను స్వప్రయోజనాల కోసం విచక్షణా రహితంగా తొలగిస్తున్నారన్నారు. వీటి తొలగింపు వల్ల ప్రకృతికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని, తాటిచెట్లు పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని అర్జీ కోరారు.

సాగునీరు అందించరూ..

ఆలమూరు: సాగునీరు అందించాలని కోరుతూ పినపళ్లకు చెందిన పలువురు రైతులు సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందజేశారు. సాగునీరు అందక రైతులు ఇబ్బందులకు ఎదుర్కొంటున్నామని, కంకి దశలో ఉన్న వరి పంట ఎండిపోతోందని వాపోయారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి మండలంలోని అందరి పరిస్థితి ఇలానే ఉందని తెలిపారు. వరహా కాలువ, వెదురు మూడి కాలువలోకి సాగునీరును సక్రమంగా విడుదల చేయాలని కోరారు. సాగునీరు విడుదలలో సత్వర న్యాయం చేయకపోతే పంటలను వదిలేసుకునే పరిస్థితి తలెత్తుతుందని అధికారులకు ఇచ్చిన వినపతి పత్రంలో పేర్కొన్నారు.

కోల్‌కతా సంఘటనను నిరసిస్తూ మానవహారం



మామిడికుదురు సెంటర్‌లో విద్యార్థుల మానవహారం



మలికిపురంలో మానవహారం నిర్వహించిన విద్యార్థులు

మామిడికుదురు: కోల్‌కతా సంఘటనను నిరసిస్తూ దీప్తి కళాశాల విద్యార్థులు సోమవారం నిరసన ప్రదర్శన చేశారు. బస్టాండ్ కూడలిలో మానవహారంగా ఏర్పడి జూనియర్ డాక్టర్‌పై అత్యాచారానికి పాల్పడి, ఆమెను హత్య చేసిన నిందితులను ఉరి తీయాలని, మహిళలను కాపాడాలని నినాదాలు చేశారు. బస్టాండ్ కూడలిలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. అనంతరం అక్కడి నుంచి మండల రెవెన్యూ కార్యాలయం, నగరం పోలీస్ స్టేషన్ వరకు నిరసన ప్రదర్శన చేశారు. దీప్తి విద్యా సంస్థల అధినేత డీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది.

విద్యార్థుల నిరసన

మలికిపురం: కోల్‌కతాలో సంఘటనపై విద్యార్థులు నిరసన తెలిపారు. స్థానిక చొప్పల వెంకటరత్నం మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీ, దీప్తి స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొని మలికిపురం ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహించారు. మలికిపురం సెంటర్ వరకూ ర్యాలీ చేశారు. ర్యాలీలో కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీసుధ, ఎస్.వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- ఎంపీపీ గంగాధరరావు
- వానపల్లి, అవిడి పీహెచ్‌సీలో హెచ్‌డీసీల సమావేశాలు



అవిడి పీహెచ్‌సీలో వైద్య సేవలపై సమీక్షిస్తున్న ఎంపీపీ గంగాధరరావు

కొత్తపేట: ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ముఖ్యంగా జ్వరాలపై అందరూ అప్రమత్తంగా ఉండి పనిచేయాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు సూచించారు. మండల పరిధిలోని అవిడి, వానపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు) అభివృద్ధి కమిటీ (హెచ్‌డీసీ)ల సమావేశాల సోమవారం నిర్వహించారు. ఎంపీపీ, ఆయా హెచ్‌డీసీల చైర్మన్ గంగాధరరావు అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో పలు అంశాలు చర్చించి, తీర్మానించారు. ఈ సమావేశంలో ప్రధానంగా సీజనల్‌గా వ్యాపించే సాధారణ జ్వరాలతో పాటు టైఫాయిడ్, డెంగీ జ్వరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైన వారికి రక్త పరీక్షలు చేయాలని, మందులు అందించాలని సూచించారు. 24 గంటలు రోగులకు అందుబాటులో ఉండాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీలకు ప్రభుత్వం ఇస్తున్న హెచ్‌డీఎఫ్ నిధులు సుదీర్ఘ కాలంగా రూ.1.75 లక్షలు మాత్రమే విడుదల చేస్తున్నారని, పీహెచ్‌సీల మెయింటెనెన్స్ ఖర్చులు, చార్జీలు విపరీతంగా పెరిగిపోయిన నేపథ్యంతో నిధులు పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. ఈ సమావేశాల్లో అవిడి, మోడేకుర్రు, వానపల్లి సర్పంచ్‌లు రెడ్డి చంటి, కుడుపూడి రామలక్ష్మి, పల్లి భీమారావు, వైద్యులు డాక్టర్ నిహారిక, డాక్టర్ పీ రవికుమార్, డాక్టర్ శివ, డాక్టర్ వెంకటేష్ తధితరులు పాల్గొన్నారు.

తణికెళ్ల భరణికి 'ఆడు మగాడ్రా బుజ్జి' కవిత ప్రదానం



తణికెళ్ల భరణికి కవితను అందజేస్తున్న గౌస్, ప్రసాద్

కొత్తపేట: ప్రముఖ సినీ రచయిత, నటుడు తణికెళ్ల భరణికి కొత్తపేటకు చెందిన ముస్లిం సంఘ నాయకుడు, కవి, కళాసాహితి సభ్యుడు షేక్ గౌస్ 'ఆడు మగాడ్రా బుజ్జి' శీర్షికన కవితను ప్రదానం చేశారు. తణికెళ్ల భరణికి డాక్టరేట్ వచ్చిన సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన అభినందన కార్యక్రమానికి గౌస్ తన ప్రాణ స్నేహితుడు, బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు దెందులూరి జగదీశ్వరప్రసాద్, ముస్లిం నాయకుడు హర్షథ్ అలీఖాన్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సభలో భరణి బహుముఖ ప్రజ్ఞను వర్ణిస్తూ కవితా సంపుటి రాసి ఆ పత్రాన్ని ఆయనకు ప్రదానం చేసినట్టు గౌస్ తెలిపారు. భరణితో గౌస్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. రావులపాలెం సీఆర్‌సీలో జరిగే రాష్ట్ర స్థాయి నాటికలు, నాటక పోటీలకు భరణిని క్రమం తప్పకుండా ఆహ్వానిస్తారు. ఆయన వ్యాఖ్యాతగా వ్యవహరిస్తారు. ఆ విధంగా భరణికి ఈ ప్రాంతంతో మంచి అనుబంధం ఉంది.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

మలికిపురం: మండల బీసీ ఉద్యోగ సంక్షేమ సంఘం సోమవారం విశ్వేశ్వరాయపురంలోని చెల్లుబోయిన సూర్యారావు కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా పంచాయతీ రాజ్ డీఈఈ పాల్గొన్నారు. సమావేశంలో 2024లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన బీసీ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించారు. అలాగే ఈ ఏడాది పదవీ విరమణ చేసిన ఉద్యోగులు అనిశెట్టి సాయిబాబా, యాండ్ర మల్లికార్జున్‌రావు, గుబ్బల సింహాచలం లకు సన్మానం చేశారు. అలాగే బోధనా సిబ్బందిని కూడా సన్మానించారు. మండలం బీసీ ఉద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంకటాల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి జేపీ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణతో తరగతి బోధన మరింత మెరుగు



సమావేశంలో పాల్గొన్న అధికారులు

సఖినేటిపల్లి: పాఠశాల సముదాయ శిక్షణతో తరగతి బోధన మరింత మెరుగు పడుతుందని జిల్లా మానటరింగ్ అధికారి పి.రాంబాబు, జిల్లా సైన్స్ అధికారి జి.సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఫిజికల్ సైన్స్ ప్రైమరీ స్థాయి శిక్షణా కార్యక్రమం విద్యా శాఖ ఏర్పాటు చేసింది. ఇందుకు సంబంధించిన సమావేశాన్ని అధికారులు రాంబాబు, సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో పాఠ్యాంశాలు బోధించే ఉపాధ్యాయులకు ప్రతి నెలా రెండు రోజులు పాటు పాఠశాల సమావేశాలు నిర్వహిస్తామన్నారు. దీని ద్వారా వృత్తి నైపుణ్యం, బోధనలో నూతన విధానాలను అందిపుచ్చుకోవచ్చునన్నారు. ఎంఈవో-1 డి.కిషోర్ కుమార్, హెచ్ఎంలు ఎస్.శ్రీధర్ కృష్ణ, జె.కనకలింగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

మామిడికుదురు: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధించాలని ఎంఈఓ మోకా వెంకన్నబాబు సూచించారు. మగటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

ఘనంగా స్వామివారి మాస కల్యాణం



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈవో

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి శ్రీ జగన్మోహినీ కేశవ స్వామి ఆలయంలో సోమవారం స్వామివారి మాస కల్యాణం కనుల పండువగా జరిగింది. ఉదయం స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అవరణలో స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణాన్ని తిలకించిన భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ స్వామి వారి కల్యాణం సందర్భంగా ర్యాలి గ్రామానికి చెందిన జిన్నూరు నాగేశ్వరరావు, పార్వతి దంపతులు స్వామివారికి రూ.20 వేలు విలువ చేసే 5 గ్రాములు విలువ చేసే వెండి యజ్ఞోపవీతం, అమ్మవార్లకు 2.350 గ్రాముల రెండు జతల బంగారు సూత్రాలు బహుకరించినట్టుతెలిపారు. దాతకు ఆయన చేతుల మీదుగా స్వామివారి చిత్రపటం అందజేశారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బంద్ విజయవంతం చేయండి

కొత్తపేట: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం తలపెట్టిన బంద్‌ను అన్ని వర్గాల సంపూర్ణ సహకారంతో విజయవంతం చేయాలని రాష్ట్ర, జిల్లా మాలమహానాడు నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం స్థానిక గ్రామ పంచాయతీ గెస్ట్‌హౌస్‌లో రాష్ట్ర దళిత నాయకుడు, అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, జిల్లా మాలమహానాడు నాయకుడు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు తదితర నాయకుల ఆధ్వర్యంలో మాలమహానాడు నాయకులు సమావేశమై భారత్ బంద్ నిర్వహణపై చర్చించారు. బంద్‌కు అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా, మండల దళిత నాయకులు మోర్త వెంకటేశ్వరరావు, బూసి బాష్కరరావు, ఎం.బాలకృష్ణ విజయకుమార్ పాల్గొన్నారు.

బంద్ విజయవంతానికి విజ్ఞప్తి

మలికిపురం: భారత్ బంద్‌కు సహకరించాలని కోరుతూ మండల మాల సంఘాల ఆధ్వర్యంలో బృందం మలికిపురం కళాశాలలను కోరింది. ఈ మేరకు స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తోరం సతీషకు కరపత్రం అందించారు. గడ్డం తులసీ భాస్కరరావు, దేవ దయానంద్, రాజబాబు, మహేశ్, పిలిప్‌రాజు, ప్రతాప్, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు లక్ష్మీప్రసన్న



రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతో కోచ్

అంబాజీపేట: అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని కేఎల్ ప్రసన్న తెలంగాణ రాష్ట్రంలోని గద్వాలలో త్వరలో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైందని హెచ్ఎం కె.సాయిరామ్ సోమవారం తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో విజయనగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 62 కిలోల విభాగంలో ప్రసన్న బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిందన్నారు. ఆమెతో పాటు సింగిల్స్‌లో పి.భార్గవిశ్రీకళ వెండి పతకం సాధించిందన్నారు. జూనియర్స్ 55 కిలోల విభాగంలో పి.ఆదిత్య కాంస్య పతకం సాధించాడని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను హెచ్ఎం సాయిరామ్, కోచ్ పి.త్రిమూర్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



అంబాజీపేటలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై చిరంజీవి



పి.గన్నవరంలో డాగురే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు



కొత్తపేటలో సీనియర్ ఫొటో, వీడియో గ్రాఫర్లను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

అంబాజీపేట: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముక్కామల నుంచి అంబాజీపేట వరకు మోటార్‌సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. అంబాజీపేటలో జరిగిన కార్యక్రమంలో ఎస్సై చిరంజీవి జెండాను ఆవిష్కరించారు. ఫొటో గ్రాఫర్స్ అందరి మధుర జ్ఞాపకాలను గుర్తుండిపోయేలా తీపి గుర్తులు మిగులుస్తారన్నారు. సీనియర్ ఫొటోగ్రాఫర్ లూటుకుర్రి సాయిబాబును సన్మానించారు. సంఘం గౌరవాధ్యక్షుడు గుమ్మడి రాజు, అధ్యక్షుడు గంగా వెంకటగిరి, కార్యదర్శి ప్రతాప్, ఉపాధ్యక్షుడ ప్రసాద్, నగేష్, ఖాజాబాబు, తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: ఫొటో గ్రఫీ దినోత్సవాన్ని పి.గన్నవరం కొత్త అక్విడెక్టు పార్కులో మండల ఫొటో గ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. సంఘ అధ్యక్షుడు కొక్కిరి రవికుమార్, నాయకులు తోట రామకృష్ణ, గూటం శ్రీనివాస్, షేక్ దొరబాబు, కడలి శ్రీనివాస్, మెల్లం వెంకటేష్ పాల్గొన్నారు.

మామిడికుదురు: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మామిడికుదురు బస్టాండ్ సెంటర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. కెమెరా సృష్టికర్త డాగురే చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ది ప్రొఫెషనల్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోటి, హీరు, సుబ్బారావు, శ్రీను, రామకృష్ణ, పుల్లారావు, రవి, నూకరాజు, బాబి, సుబ్బులు, అభిమన్యు, ఉమ, సురేష్, అన్వర్, చంటి, అబ్బాస్, తదితరులు పాల్గొన్నారు.

డాగురే కెమేరా సృష్టితో లక్షలాది మందికి ఉపాధి

కొత్తపేట: కెమెరా సృష్టించడం ద్వారా లూయిస్ జాక్వెస్ మాండే డాగురే లక్షలాది మందికి ఉపాధి కల్పించిన మహనీయుడని సీనియర్ ఫొటోగ్రాఫర్ నామాల వెంకటేశ్వరరావు (శ్రీను) అన్నారు. కొత్తపేట ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని కొత్తపేటలో ఘనంగా జరుపుకొన్నారు. కెమెరా సృష్టికర్త లూయిస్ జాక్వెస్ మాండే డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీనియర్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ నామాల శ్రీను, ఎం.నాగేశ్వరరావు, కె.బంగార్రాజులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ డీ ఏడుకొండలు, వైస్ ప్రెసిడెంట్ జి.పెద్దిరాజు, సెక్రటరీ ఎస్. ఏడుకొండలు, ట్రెజరర్ వై.శివకల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: గ్రామంలో మండల ప్రొఫెషనల్ ఫొటో గ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 185వ వరల్డ్ ఫొటోగ్రఫీ డే నిర్వహించారు. డాగూరే ఫ్లెక్సీ వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. బుంగ కుమార్, సీహెచ్ కిషోర్, స్టాలిన్, పి.శేఖర్, బి.చిట్టిబాబు, ఎం.చిన్ని, జి.రాజేష్, జి.రాజు పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్



ర్యాలిలో రాఖీ సంబరాలు చేస్తున్న దృశ్యం



కొత్తపేట లో తన తోటి విద్యార్థికి రాఖీ కడుతున్న చిన్నారి

ఆత్రేయపురం, కొత్తపేట, ఆలమూరు: అన్నా చెల్లెళ్ల, అక్కా తమ్ముళ్ల అనురాగానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను వాడవాడలా ఘనంగా జరుపుకొన్నారు. అక్కా తమ్ముడు, చెల్లెళ్లు అన్నాకు రాఖీ కట్టి ఆనందంగా సందడి చేశారు. సోదరులు తమకు తోచిన బహుమతులు ఇచ్చారు.

ఆక్రమణలు తొలగించండి

ఆలమూరు: నర్శిపూడిలో కామయ్య గారి చెరువు ఆక్రమణలను తొలగించాలని ఆ గ్రామాల ప్రజలు జిల్లా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీఎస్‌పీవీ)కు ఫిర్యాదు చేశారు. ఆ చెరువులోకి డ్రైనేజీలను అనుసంధానం చేయడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతుందని, అంటువ్యాధుల వ్యాప్తికి కారణమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువును బాగు జేయాలని ఉండమట్ల శేషగిరి, యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఆకుల గనిరాజు, మద్దిశెట్టి రామగోవిందు తదితరులు తెలిపారు.

'ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన'పై అవగాహన

అయినవిల్లి: ఎస్.మూలపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న చెత్త నుంచి సంపదను తయారు చేసే కేంద్రం వద్ద ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశం సర్పంచ్ బొబ్బ ప్రభాత్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, డీఆర్‌డీఏ పీడీ శివశంకర ప్రసాద్, ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా రాయితీతో ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవడం వల్ల లభించే లాభాల కోసం వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.